క్లుప్తంగా

జార్జిరెడ్డి పోరాటం స్ఫూర్తి



జార్జిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యార్థి ఉద్యమ నేత, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఉద్యమ నిర్మాత జార్జ్‌రెడ్డి పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి పేర్కొన్నారు. జార్జిరెడ్డి 51వ వర్ధంతి కార్యక్రమం స్థానిక కోట దిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ నగర శాఖ ఆధ్వర్యంలో సంఘం సభ్యుడు దుర్గాప్రసాద్ అధ్యక్షత గురువారం ఉదయం నిర్వహించారు. జార్జిరెడ్డి చిత్రపటమానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీహెచ్ సునీల్, డిగ్రీ కాలేజీ కమిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం



ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న భీమేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఏలూరు నగరపాలక సంస్థ విప్ పైడి బీమేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక కుండీ సెంటర్ వద్ద దేవదాయ శాఖకు చెందిన అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకెళ్లాల్సి వస్తే గొడుగులు, టోపీలు ధరించాలని, ద్రవ పదార్థాలు తరచూ తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. తొలుత దేవదాయ శాఖకు చెందిన చెరుకువాడ వారి సత్రం, కంది అయ్యన్న సత్రం నిధులతో సంయుక్తంగా స్థానిక మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని 34వ డివిజన్ కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్ ప్రారంభించారు. కార్యక్రమాలను ఆయా సంస్థల కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వరరావు పర్యవేక్షించారు. వేసవి కాలం ముగిసే వరకు మజ్జిగ చలివేంద్రాలు కొనసాగుతాయని ఆయన చెప్పారు.

ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యం

- డివిజన్లల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్
- పర్యవేక్షించిన పార్టీ నాయకులు



సిబ్బందితో డ్రెయిన్‌లో సిల్టు తొలగింపజేస్తున్న డివిజన్ ఇన్‌చార్జి అలీఖాన్

ఏలూరు టౌన్: ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఏలూరు నగరంలోని ఆయా ప్రాంతాల్లో శానిటరీ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వేసవి కాలం కావడంతో శానిటేషన్ గ్యాంగ్‌వర్క్ ప్రారంభించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. వర్షాకాలంలో డ్రెయినేజీల్లో సక్రమంగా మురుగునీటి పారుదల ఉండేలా చెత్త వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఆయా డివిజన్లల్లో ఇప్పటికే కార్పొరేటర్లు, ఇన్‌చార్జులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డ్రెయిన్లు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు.

- 18వ డివిజన్‌లోని ఆయా ప్రాంతాలను కార్పొరేటర్ ఇనపనూరి కేథారేశ్వరి, పార్టీ నాయకులు ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో పరిశుభ్రం చేసేందుకు చర్యలు చేపట్టారు. గురువారం డివిజన్‌లోని వంగాయగూడెం తదితర ప్రాంతాల్లో రోడ్ల వెంబడి, డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను తొలగింపునకు శానిటేషన్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ పనులను డివిజన్ ఇన్‌చార్జి జగదీష్ పర్యవేక్షించారు.
- 46వ డివిజన్ కార్పొరేటర్ అయేషా సుల్తానా, పార్టీ ముస్లిం నాయకులు రియాజ్ అలీఖాన్ ఆధ్వర్యంలో పెన్షన్‌లైన్‌లోని పాత సెయింట్ మైఖేల్ స్కూల్ సందులో గ్యాంగ్ వర్క్ చేపట్టారు. డ్రెయిన్లలో సిల్ట్‌ను తొలగించడంతో పాటు రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలు, చెత్తా, వ్యర్థాలను తొలగించే పని చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీలు చెత్తతో పూడుకుపోవడంతో వాటిని శానిటేషన్ సిబ్బందితో క్లియర్ చేయించారు. శానిటరీ మేస్త్రీ రవికాంత్, శానిటరీ సిబ్బంది ఉన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



ఏలూరు డివిజన్లల్లో కార్పొరేటర్ల వినతి మేరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. వేసవి కాలం పూర్తయ్యేలోపు డ్రెయిన్లలో పూడికలు తొలగించేందుకు గ్యాంగ్ వర్క్ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– సంక్రాంతి వెంకటకృష్ణ, నగర కమిషనర్, ఏలూరు



18వ డివిజన్‌లో రోడ్డుపై చెత్తను తొలగిస్తున్న సిబ్బంది



వీధిలో వ్యర్థాలను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

కరెన్సీపై అంబేడ్కర్ ముఖ చిత్రాన్ని ముద్రించాలి



మాట్లాడుతున్న బొనిగల రామారావు

ఏలూరు (టూటౌన్): భారత కరెన్సీపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముఖ చిత్రాన్ని ముద్రించాలని కమర్షియల్ టాక్స్ జాయింట్ డైరెక్టర్, దళిత చరిత్ర, సాహిత్య పరిశోధకులు, కవి, రచయిత బొనికల రామారావు కోరారు. ఏలూరు కొత్త రోడ్డులోని నవ సమాజ్ సొసైటీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన దళిత నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారత కరెన్సీపై అంబేడ్కర్ ముఖచిత్రాన్ని ముద్రించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్, నేతల రమేష్ బాబు, సీహెచ్ సాయిరాజు, ఫరీద్ ఖాసిం, పోలిమెట్ల మోజేస్, కాకర్ల రాజేంద్ర ప్రసాద్, భూపతి అప్పారావు, మేడిశెట్టి గిరిబాబు, ఎల్ఐసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌కు సాదర స్వాగతం



మంత్రి విశ్వరూప్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు(మెట్రో)/ఏలూరు టౌన్: జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఏలూరు విచ్చేసిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్ తొలుత మాజీ మంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విశ్వరూప్‌కు ఆళ్ల నాని కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు. విశ్వరూప్‌కు స్వాగతం పలికిన వారిలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, సాహిత్య అకాడమి చైర్మన్ పిల్లంగొళ్ల శ్రీలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మెడికల్ బోర్డ్ సభ్యుడు దిరిశాల ప్రసాద్, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, బీసీ నాయకులు కిలాడి దుర్గారావు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, వాణిజ్య సెల్ ఎన్ సదానందం, గంటా ప్రసాదరావు, జున్నూరి నరసింహారావు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వన్‌టౌన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ ఆదిప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ హెచ్చరించారు. గురువారం రాత్రి ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ వాహన తనిఖీలు చేశారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు కలిగి ఉన్నారా? లేదా అనేది పరిశీలించారు. పలు వాహనాలకు పత్రాలు సరిగ్గా లేకపోవడంతో జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ ఆదిప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో వాహనదారులు ఇష్టారాజ్యంగా రోడ్లపై తిరిగితే సహించేది లేదని, నిబంధనలు పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాల రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారని, ఎదుట వ్యక్తులకు నష్టాన్ని కలిగించేలా వ్యవహరించవద్దని సూచించారు.

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తోన్న సంక్షేమ పథకాల పట్ల పూర్తి స్థాయిలో లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు మా నమ్మకం నువ్వే జగన్ అంటూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, డివిజన్ కార్పొరేటర్లు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. గురువారం వన్‌టౌన్ 10వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జోన్–1 ఇన్‌చార్జి మోటమర్రి సదానందం, నగర పాలక సంస్థ విప్ పైడి భీమేశ్వరరావు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి అనుమతితో ఇంటి వద్ద డోర్ స్టిక్కర్లను అతికించారు. కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ నాయకులు వేణుగోపాల్, వినీత్, పిట్టా ధనుంజయ్ తదితరులు ఉన్నారు. 46వ డివిజన్‌లో కార్పొరేటర్ అయేషా సుల్తానా, ముస్లిం మైనార్టీ నాయకులు రియాజ్ అలీఖాన్ ఆధ్వర్యంలో 19వ సచివాలయం పరిధిలోని ఏడు క్లస్టర్లల్లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశారు. కన్వీనర్లు, గృహసారథులు ప్రత్తిపాటి రామకృష్ణ, సుల్తానా, షేక్ ఇమ్రాన్, సయ్యాద్ రేష్మా, షేక్ రెహనా బేగం, నూరుల్లా షరీఫ్, షేక్ జానీ, మెహరున్నీసా తదితరులు ఉన్నారు. ఏలూరు 50వ డివిజన్‌లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ఆదేశాల మేరకు సచివాలయ కన్వీనర్ బంగారమ్మ, కిరణ్ ఆధ్వర్యంలో ఎంఆర్‌సీ కాలనీ, వీవీ నగర్, ఎస్ఎంఆర్ నగర్‌లలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

కొల్లేరు గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగన్'

ఏలూరు రూరల్: ఏలూరు మండలం గుడివాకలంక, కోమటిలంక, మాదేపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, బాపనయ్య, పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, గృహసారథుల మండల కన్వీనర్ గుర్రం శివ, సర్పంచ్ తెనాలి యోహాన్, జయమంగళ రామారావు తదితరులు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసరాజు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై కొల్లేరు ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలని కోరుతున్నారని చెప్పారు. పథకాల వల్లే తమ పిల్లాపాపలను చదివించుకుంటూ సంతోషంగా జీవిస్తున్నామని, మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ కరపత్రాలతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్లును ఇళ్లకు అతికించుకున్నారని చెప్పారు.



46వ డివిజన్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు రియాజ్ అలీఖాన్



50వ డివిజన్‌లో ఇంటి గోడకు స్టిక్కర్ అతికించిన కన్వీనర్లు, గృహసారథులు



కోమటిలంకలో ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



10వ డివిజన్‌లో మహిళకు స్టిక్కర్ ఇస్తున్న నాయకులు

మానవులకు మార్గదర్శి ఖురాన్



ఇఫ్తార్‌లో మాట్లాడుతున్న మొహమ్మద్ రఫీఖ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఖురాన్ గ్రంథం మానవులందరికీ మార్గదర్శకం వహిస్తుందని, ఇది ముస్లింల సొత్తు కాదని జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రఫీఖ్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ ఏలూరు నగర శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హోటల్ ఆదిత్య ప్రిన్స్ ఇంటర్నేషనల్‌లో ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రఫీఖ్ మాట్లాడుతూ ఇఫ్తార్ కార్యక్రమాల ద్వారా మతసామరస్యం పెంపొందుతుందన్నారు.

తోటి వారి మతాచారాలు తెలుసుకుంటే వారి మతం పట్ల గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. ఉగాది పండుగ నాడు హిందువులకు తమ సంస్థ ద్వారా గ్రీటింగ్ కార్డులు ఇంటింటికి వెళ్లి పంచి పెడతామని, వారు చాలా ఆనందం వ్యక్తం చేస్తారని తెలిపారు. అన్ని మత గ్రంథాల్లో దేవుడు ఒక్కడే అని పేర్కొనే ఉందని, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేసి అధికార పీఠాన్ని కైవసం చేసుకుంటారని ఆరోపించారు. దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఖురాన్ రంజాన్ నెలలో అవతరించిందని దీనికి కృతజ్ఞతగా ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల ముస్లింలు ఉపవాసాలు భక్తిశ్రద్ధలతో పాటిస్తారని వివరించారు. ఉపవాసం ఉండడం వల్ల చాలా ఆరోగ్యకరమైన మేలులు ఇమిడి ఉన్నాయని తెలిపారు. ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్నవారు ఉపవాసం ఉండడం వల్ల పేదవారి ఆకలి బాధ తెలిసి దాన ధర్మాలు చేయడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సనాతన, సహజమైన ఖురాన్ గ్రంథంలో తన హక్కులు పాటించడంలో నిర్లక్ష్యం వహించినా క్షమిస్తానని, దాసుల హక్కులు కబళిస్తే దాసుడు క్షమించేంతవరకు తాను క్షమించినని దేవుడు పేర్కొన్నారని వివరించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై కె.ప్రసాద్, జేఐహెచ్ జిల్లా కన్వీనర్ ఎండీ నయూముల్లా, ఏలూరు అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, హిందూ ముస్లిం క్రైస్తవులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్



మానసిక వికలాంగుల పాఠశాలలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం

ఏలూరు (టూటౌన్) : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కరుణోదయ మానసిక వికలాంగుల పాఠశాల చైర్మన్ కలతోటి హేంద్రీ డోమినిక్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం గురువారం స్థానిక పాఠశాలలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివ్యాంగులకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా డోమినిక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించి సుస్థిర పాలనకు, దేశ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ఏలూరు జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో ప్రముఖులైన బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతులు రావడం సంతోషకరమన్నారు.

ఆపత్కాలంలో ఆదుకోవాలి

భీమడోలు: క్షేత్ర స్థాయిలో ఆపత్కాలంలో ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ఆపద మిత్రలదేనని ఎంపీడీఓ జీఎల్ఎన్‌వీ రాఘవన్ అన్నారు. భీమడోలు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో శిక్షణ పొందిన 20 మంది ఆపద మిత్రలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాఘవన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రకృతి వైపరీత్యాలు, భూ కంపాలు, సునామీలు, అగ్ని, గ్యాస్, రోడ్డు ప్రమాదాలు, పాము కాట్లు, కాలువలో మునిగిపోవడం వంటి ప్రమాదాలు సంభవించినప్పుడు వారికి ఆపద మిత్రలు తగు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కిట్లలోని 16 వస్తువులను అవసరం మేరకు వినియోగించాలన్నారు. గ్రామ పంచాయతీల వద్ద ఆపద మిత్రల సెల్ ఫోన్ నెంబర్లను ప్రదర్శించాలని అన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గుణదల(విజయవాడ తూర్పు): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం పినకడిమి ప్రాంతానికి చెందిన బొబ్బా అనిల్ కుమార్ ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఏడాది క్రితం భార్య చనిపోగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుమారు ఐదురోజుల క్రితం వ్యక్తిగత పనుల నిమిత్తం విజయవాడకు వచ్చిన అనిల్ కుమార్ గవర్నర్ పేటలోని ఓ లాడ్జిలో రూమ్ తీసుకుని ఉన్నాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో అతడు అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించిన లాడ్జి నిర్వాహకులు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 12వ తేదీ అర్ధరాత్రి 2 గంటల సమయంలో మృతి చెందాడు. అనిల్‌కుమార్ సోదరుడు కిషోర్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు వివరాలు సేకరించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా గత కొంతకాలంగా అనిల్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కిషోర్‌బాబు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

అండర్ పాసు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలి

భీమడోలు: జాతీయ రహదారి కొమిరేపల్లి వద్ద అండర్ పాసు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల అధ్యక్షుడు టి.సుమన్ బాబు కోరారు. గుండుగొలనులో గురువారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సమావేశం నిర్వహించారు. సుమన్‌బాబు మాట్లాడుతూ ఎంతో కాలంగా కొమిరేపల్లి గ్రామస్తులు పోరాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొమిరేపల్లికు చెందిన యువకుడు కుటుంబానికి రూ.20 లక్షల పరిహారంతో పాటు ఆ కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. కొమిరేపల్లి వద్ద జరిగిన రాస్తారోకోను పోలీసులు సామరస్యంగా పరిష్కరించుకుండా దళితులపై లాఠీ ఛార్జి చేయడం సరికాదని తెలిపారు.

డ్రైవర్‌కు గాయాలు

పెదపాడు : ఆగిఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాళ్లమూడి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో విజయవాడ వైపు నుంచి ఏలూరు వైపునకు వెళ్తున్న బొలెరో వాహనం లారీని ఢీకొంది. ఈఘటనలో డ్రైవర్ సైదు రాములుకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుమేరకు ఎస్సై బి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న సాంస్కృతిక కళా సమ్మేళనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం 44వ కార్యక్రమంగా ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో ఏర్పాటు చేసినట్టు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి పెదపాటి రామకృష్ణ, అధ్యక్షుడు మోదుగు కృష్ణారావు, కోశాధికారి కేవీ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ రచయిత్రి రాజ్యలక్ష్మి రచించిన వీడ్కోలు పుస్తకావిష్కరణ, నాట్యాచార్య గండికోట రాజేష్ బృందం స్వాగత నృత్యాలు, మేదరమెట్ల శిరీష బృందం పుష్పవిలాపం నృత్య నాటిక ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు సాహిత్య మండలి కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం, కొత్తూరు సర్పంచ్ నాటక కళాకారుడు కడిమి గోవిందరావులకు గౌరవ సత్కారం, గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో కళాకారులు గంపల సత్యనారాయణ, బొల్లారపు రాఘవులు, మాటూరి ఆళ్వారు స్వామి, కొండవీటి పద్మారావులకు ఆర్థిక సత్కారం చేయనున్నట్టు తెలిపారు. స్థానిక గుప్తా ఫౌండేషన్ అధినేత మడుపల్లి మోహన్ గుప్తా జ్యోతి ప్రజ్వలనతో సభా కార్యక్రమం ప్రారంభమౌతుందని, ముఖ్య, గౌరవ, ఆత్మీయ అతిథులుగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కళారత్న కేవీ సత్యనారాయణ, ప్రముఖ సాహితీవేత్త లంక వెంకటేశ్వర్లు, ప్రముఖ చిత్రకారులు మజ్జి కాంతారావు, మానవత సంస్థ ప్రతినిధి అలపాటి నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు.